క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్:ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలు వివరించి పరిష్కారం పొందేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జి. రాజేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు తెలిపేందుకు 9959225464 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ఆక్రమణలు తొలగించాకే డ్రెయిన్ అభివృద్ధి పనులు

పామర్రు: ఆక్రమణలు తొలగించిన తర్వాతే డ్రెయిన్ అభివృద్ధి పనులు చేపడతామని ఇరిగేషన్ శాఖ జేఈ రామ్‌కుమార్ తెలిపారు. పామర్రు మురుగు డ్రెయిన్ పరీవాహక ప్రాంతం, చల్లపల్లి రోడ్డు వెంబడి ఉన్న డ్రెయిన్‌లను గురువారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. కొంత మంది డ్రెయిన్లు ఆక్రమించి అక్రమంగా కట్టడాలు చేపట్టారని, వాటికి పక్కనే ఉన్న ఖాళీ స్థలాలను సైతం ఆక్రమించుకుని చుట్టూ గ్రీన్ క్లాత్‌లు చుట్టారని తమ పరిశీలనలో తేలిందన్నారు. సత్వరమే ఆ గ్రీన్ మ్యాట్‌లను తొలగించాలని పేర్కొన్నారు. చల్లపల్లి రోడ్డు వెంబడి ఉన్న డ్రెయిన్‌ను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీని వల్ల డ్రెయిన్‌లో అనేక అడ్డంకులు ఏర్పడుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారని చెప్పారు. సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటామని స్థానికులకు జేఈ హామీ ఇచ్చారు.

15 వరకు అడ్మిషన్ల గడుపు పొడిగింపు

పామర్రు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం కోర్సుల్లో ఆన్‌లైన్ అడ్మిషన్‌లకు ఈ నెల 15వ తేదీ వరకు సమయం పొడిగించారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్ తెలిపారు. మూడవ ఫేజ్ షెడ్యూల్ రిజిస్ట్రేషన్ తేదీని పొడిగించారన్నారు. తొలిదశలో అడ్మిషన్ పొందని విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వీలుగా కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్ప్ డెస్క్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల అడ్మిషన్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్ ఆధ్వర్యంలో ఈ హెల్ప్ డెస్కు నడుస్తుందన్నారు.

సిద్ది బుద్ధి గణపతిగా స్వామి



గుడివాడ టౌన్:గణేశ్ ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం స్వామి వారిని సిద్ధిబుద్ధి గణపతిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

ముంపు పొలాల పరిశీలన




మండవల్లి: మండలంలోని పెరికెగూడెం, కానుకొల్లు గ్రామాల్లో ముంపు బారిన పడిన వరి పొలాలను మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటితో నిండిన పొలాల్లో నీటిని బయటకు తీసి వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో 500 ఎకరాల్లో వరి పైరు భారీ వర్షాలకు దెబ్బతిన్నట్లు ఏవో తెలిపారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



మండవల్లి: మండలంలోని భైరవపట్నం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో, పాఠశాల సామగ్రి, స్మార్ట్ టీవీల సెక్యూరిటీ నిమిత్తం గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎంఈవో-1 దొడ్డ రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పనితీరు పర్యవేక్షించారు. హెచ్ఎం నండూరి వి.బాల సుబ్రహ్మణ్యంను అభినందించారు.

స్టేడియంలో ధ్యాన శిక్షణ తరగతులు



గుడివాడ టౌన్:పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సామూహిక ధ్యాన శిక్షణా తరగతులు గురువారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా నిర్వాహకురాలు రాజకుమారి మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఈ ధ్యానకేంద్రం కొనసాగిస్తామన్నారు. ఆసక్తిగల వారు ఈ ధ్యానంలో పాల్గొనాలని కోరారు.

బుడమేరుకు తగ్గుతున్న వరద



పుట్టగుంట వద్ద తగ్గిన బుడమేరు ఉధృతి

గుడివాడరూరల్/నందివాడ:నందివాడ మండలం పుట్టగుంట వంతెన వద్ద బుడమేరు ఉధృతి కొద్దిగా శాంతించింది. పై నుంచి వస్తున్న వరద ఉధృతి తగ్గడంతో బుడమేరు వంతెన వద్ద వరద ప్రవాహం స్వల్పంగా తగ్గింది. గురువారం రెండున్నర అడుగుల మేర నీరు తగ్గింది. వారం రోజులుగా కన్పించని వంతెన రెయిలింగ్ పైభాగం వంతెన దారి కన్పించాయి. గత 13 రోజులుగా ఎంఎన్‌కె రహదారిపై రాకపోకలను అధికారులు నిలుపుదల చేశారు. మరో నాలుగైదు రోజుల్లో రాకపోకలు పునరుద్ధరణ చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. బుడమేరు ఉధృతి తగ్గినప్పటికీ పరివాహక గ్రామాల్లో ఇంకా వరద నీరు బయటకు పోలేదు. గ్రామాల్లో వరద నీరు ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు త్వరితగతిన గ్రామాల నుంచి వరదనీరు బయటకు పోయే చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. వరద నీరు నిల్వ ఉంటే అంటు వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పంట పొలాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయని, పంట పనికి రాదని రైతులు వాపోతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

గ్రామాల్లో నిలిచిన నీళ్లు...

మండలంలోని చంద్రయ్య, నెప్రాలి, దోసపాడు, ఆత్కూరు, డ్రెయిన్లతో పాటు సాగునీటి కాల్వల్లోనూ ఎగువ నుంచి నీరు వస్తుండడంతో బుడమేరకు పక్కనే ఉండే పుట్టగుంట, పెదలింగాల, చేదుర్తిపాడు, చినలింగాల, ఒద్దులమెరక, శ్రీనివాసపురం గ్రామాలు పూర్తి ముంపు బారిన పడగా, జనార్ధనపురం, నందివాడ, అరిపిరాల, రామాపురం, తుమ్మలపల్లి, వెన్ననపూడి, పెదవిరివాడ, ఇలపర్రు గ్రామాల్లో పాక్షిక ముంపులో, రుద్రపాక, కుదరవల్లిలో కొన్ని ప్రాంతాల్లోనూ నీరు నిలిచింది. పది రోజులుగా ముంపులో ఉన్న ఇళ్లు క్రమంగా గోడలు పడిపోతూ గృహ యజమానులకు ఆందోళన కల్గిస్తున్నాయి. మూసేసిన 46 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు గాను తమిరిశ, ఏలీపురం, అనమనపూడి, దండిగానపూడి, గొంగళ్లమూడి, పోలుకొండ తదితర గ్రామాల్లోని 12 పాఠశాలలను తెరిచినట్లు ఎంఈవో రత్నరాజు వెల్లడించారు.

రక్తహీనత నివారణపై అవగాహన



రక్తహీనతపై మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్

ముదినేపల్లి రూరల్: కిశోర బాలికలు రక్తహీనతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గురజ పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ జొనాతన్ అన్నారు. మండలంలోని శ్రీహరిపురం శివారు చేవూరుపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం కార్యకర్తలకు రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిశోర బాలికల్లో రక్తహీనత వలన అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. వీటిని నివారించేందుకు తగిన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ ప్రసూన మాట్లాడుతూ పోషక మాసోత్సవాల్లో భాగంగా పలు సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తూ బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు తగిన సూచనలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి జ్యోత్స్న, ఏఎన్ఎం సౌజన్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన ర్యాలీ

భూషణగుళ్ళ(పెదపారుపూడి): మండలంలోని భూషణగుళ్ళ-1 సెంటర్‌లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం మాస ఉత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ పెదపారుపూడి సెక్టర్ సూపర్‌వైజర్ అరుణకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవటం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



కాజ(మొవ్వ): సీపీఎం నేత సీతారాం ఏచూరి మృతి పట్ల ఆ పార్టీ మండల నాయకులు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కాజ లైబ్రరీ వద్ద నివాళులర్పించారు. కార్మిక, పీడిత ప్రజా వర్గాల కోసం ఎర్ర జెండా పట్టి నిరంతరం పోరాటం చేసిన విప్లవ వీరుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఆయన జీవిత విశేషాలను వివరించారు. ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, సీఐటీయూ కార్యదర్శి కాకి రాజశేఖర్, నాయకులు పోలినాయుడు, తాతా నారాయణరావు, కొడాలి కరుణాకర్, రాయప్ప, సీహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ ఆనర్స్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొవ్వ:మండల కేంద్రంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ ఫిజిక్స్ ఆనర్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా యూనివర్సిటీ పరిధిలో గల కళాశాలల్లో 3 సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసి భౌతికశాస్త్రంను ఓ సబ్జెక్టుగా గల విద్యార్థులు ఈ కోర్సుకి అర్హులని చెప్పారు. ఆనర్స్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా పీజీ 2వ సంవత్సరంలో యూనివర్సిటీలో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను పది రోజుల్లో తమ కళాశాలలో అందించాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పామర్రు:సాయినగర్‌లో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత కాగడా హారతితో కార్యక్రమాలను ప్రారంభించారు. స్వామికి పంచామృతాలతో నవరసాలతో సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి శత సహస్ర నామాలతో పూజలు చేశారు. ఆలయంలో భక్తులు భజన కార్యక్రమం చేశారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఆలయంలో పూజలను ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ వంశ పారంపర్య అధ్యక్షుడు తమ్మ వినోద్‌రెడ్డి పేర్కొన్నారు. భక్తులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కాశీ, సాంబ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై నిగ్గు తేల్చాలి



సర్పంచ్‌పై విచారణ చేయాలని కోరుతున్న వార్డు సభ్యులు

కై కలూరు: పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లింపులో సర్పంచ్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై తుది నివేదిక ఇవ్వాలని 13 మంది పంచాయతీ వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. ఆటపాక కస్తూరి ప్లాజా అపార్ట్‌మెంట్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ పంచాయతీ అవకతవకల విషయంలో సర్పంచ్ పాత్రపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. నూజివీడు డీఎల్‌పీవోతో విచారణ చేసి నివేదికను డీపీవోకు అందించారన్నారు. డీపీవో కలెక్టర్‌కు నివేదికను సమర్పించలేదన్నారు. దీంతో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అమన్నా కౌసర్, సమయం రామాంజనేయులు, గిరి కన్యాకుమారి, పిచ్చికల జయసుధా రాణి, పిచ్చికల శివరమ్మ, బిరుదుగడ్డ రాజామణి, తోట మహేష్‌బాబు, మేడూరి నాంచారయ్య, మంచికంటి శ్రీనివాసరావు, రెహాన్ ఖాతూన్, బెల్లాని శ్యామలరావు, సమతం శ్రీను, గునిపూడి జ్యోతి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో చీడపీడల నివారణ



వెంకటాపురంలో రైతు శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రేవతి

వెంకటాపురం(మోపిదేవి): వరిలో చీడ పురుగులు, తెగుళ్లపై రైతులు యాజమాన్య పద్ధతులతో పూర్తిగా నివారించాలని కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో గురువారం వరిలో ఆశించే వివిధ చీడపురుగుల నివారణపై రైతులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. వరి పంటలో ఏఏ చీడపీడల ఉధృతి ఉంటుందో గమనించాలని సూచించారు. ఆకు ముడత పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. పొడ తెగులు నివారణకు హెక్సాకెనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా అజాక్సీస్ట్రోబిన్ ఒక మిల్లీ లీటరు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు యశ్వంత్ కుమార్, నవీన, పలువురు రైతులు పాల్గొన్నారు.

11వ నంబర్ కాలువపై రివెట్‌మెంట్ నిర్మాణం



బండికోళ్లంక వద్ద రివిట్‌మెంట్ నిర్మాణం పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ, ఏఈ

బండికోళ్లంక(మోపిదేవి): కేఈబీ కెనాల్ కింద 11వ నంబర్ కాలువపై రివిట్‌మెంట్ నిర్మాణం చేపట్టినట్లు ఇరిగేషన్ డీఈ రవి కిరణ్ తెలిపారు. మండలంలోని బండికోళ్లంక వద్ద వరదల కారణంగా ఏర్పడిన గండిని పూడ్చి రివిట్‌మెంట్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వరదల ఉధృతికి కేఈబీ కేనాల్‌కు వచ్చిన వరద కారణంగా భారీ గండి ఏర్పడిందన్నారు. కలెక్టర్ ఆదేశాలతో అత్యవసర పనుల కింద రూ. 9.50 లక్షలతో రివిట్‌మెంట్ పనులు చేపట్టినట్లు వివరించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి లాక్‌కు సరిపడా ఎత్తులో మట్టి కూడా పోయినున్నట్లు తెలిపారు. ఏఈ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

ముంపు సమస్యను పరిష్కరిస్తాం



కై కలూరు: వెలంపేట ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి ప్రణాళిక చేపడతామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక వెలంపేట, ఫైర్‌స్టేషన్ సమీప ముంపు ప్రాంతాలను ఆయన గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో డ్రెయిన్లను ఆధునికీకరిస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, కొల్లి బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చంద్రహాసోపాఖ్యానం

నాగాయలంక: స్థానిక వినాయక నవరాత్రి ఉత్సవ వేదికపై గురువారం మధ్యాహ్నం జరిగిన చంద్రహాసోపాఖ్యానం హరికథాగానం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. సబ్బినేని బోసు(చల్లపల్లి)సౌజన్యంతో కర్నూలుకు చెందిన తాటికొండ సాయిరామ్ భాగవతార్ అద్భుతమైన శైలితో కథ ఆలపించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. పూజల్లో భాగంగా లక్ష్మీగణపతి హోమం జరిగింది. కొల్లూరు శివశంకర్, అహల్య దంపతులు ఆరో రోజు వినాయక ఉత్సవ పూజలో పీటలపై కూర్చున్నారు. శ్రీలక్ష్మీదేవి అమ్మవారి కుంకుమ సామూహిక పూజ శుక్రవారం 9గంటలకు జరుగుతుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

గణేష్ లడ్డూ.. రూ.1.30 లక్షలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 9వ డివిజన్ బ్రహ్మపురంలో ఉన్న శ్రీ సాయి గణేష్ దేవాలయం వద్ద బుధవారం రాత్రి గణనాథుడి లడ్డూ వేలం నిర్వహించారు. ఆ డివిజన్ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ- రమణ (చంటి) దంపతులు రూ. 1.31 లక్షలకు దక్కించుకున్నారు. 16 సంవత్సరాలుగా ఈ ఆలయం గణేష్ నవరాత్రి మహోత్సవాల పందిరిలో ఏర్పాటు చేసిన లడ్డూలను వాణిశ్రీ దంపతులే దక్కించుకుంటూ వస్తున్నారు. వారిని భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఆలయం వద్ద ఈనెల 24వ తేదీ మంగళవారం అన్న సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు కోరారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



నూతనంగా నిర్మించిన రోడ్డు

మండవల్లి: విజయవాడ-భీమవరం ఆర్అండ్‌బీ రోడ్డుపై మండవల్లిలోని తరుగుమూల నుంచి వెళ్లే రహదారిని అధికారులు మార్పిడి చేశారు. తరుగుమూల రహదారిపై గతంలో రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతుండేవి. ఇక్కడ రోడ్డు ఎల్ ఆకారంలో ఉండి ఎదురుగా వచ్చే వాహనాలు డ్రైవర్లకు కనపడక పోవడంతో ఒకదానికొకటి ఢీకొని రోడ్డు ప్రమాదాలు సంభవించేవి. దీంతో అధికారులు స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం సమీపం నుంచి రహదారిని కొర్లపాడు గ్రామం వద్ద మెయిన్ రోడ్‌లో కలిసే విధంగా నిర్మించారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవాలు



పామర్రు బందరురోడ్డులో ఊరేగుతున్న వినాయక స్వామి



మండవల్లిలో వినాయకుడి నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పామర్రు:గణపతి నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజు పలు చోట్ల చలువ పందిళ్లలో విఘ్నేశ్వర ఆరాధన కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. జమీదగ్గుమిల్లి, రాపర్ల, ఉండ్రపూడి, పోలవరం, పామర్రులోని అరండాల్‌పేట, బాపూజీపేట, రజక బజారులో వేంచేసియున్న వినాయక స్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. బందరు రోడ్డులోని వినాయక స్వామి, చల్లపల్లి రోడ్డు, విజయవాడ రోడ్డులలోని మందిరంలో విఘ్నేశ్వరస్వాములకు అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో ప్రజలు ఊరేగింపులో పాల్గొని కాలువలో నిమజ్జనం చేశారు.

ఘనంగా నిమజ్జనోత్సవాలు

ముదినేపల్లి రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని శ్రీహరిపురం, కాకరవాడ, చేవూరుపాలెం గ్రామాల్లో నిమజ్జనోత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ కొడాలి వినోద్ పాల్గొన్నారు. తొలుత గణేష్ విగ్రహాలకు పూజలు చేసి బాణ సంచా కాలుస్తూ విగ్రహాలను వాహనాలపైకి చేర్చి డప్పు వాయిద్యాలతో ఊరేగింపులుగా వెళుతూ స్థానిక పంట కాలువలో నిమజ్జనం చేశారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, కమిటీ సభ్యులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.



కాకరవాడలో నిమజ్జనోత్సవం

ఘనంగా విఘ్నేశ్వరుడి నిమజ్జనం

మండవల్లి: మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా స్వామి వారికి నిమజ్జన కార్యక్రమం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో అంగరంగ వైభవంగా నిర్వహించిన నిమజ్జనంలో స్థానికులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అందజేత



పుట్టగుంట వరద బాధితులకు సాయమందించే వస్తువులతో పాస్టర్లు



వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న ఎస్టీయూ నాయకులు

ముదినేపల్లి రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నందివాడ మండలం పుట్టగుంట గ్రామం నీట మునిగింది. దీంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. సమాచారం తెలుసుకున్న మండల పాస్టర్ల సంఘం స్పందించింది. సంఘ నిర్వాహకులు ఉచ్చుల స్వర్ణన్‌రాజు, పుట్ట పేతురు, ప్రసన్నరాజు, విజయకుమార్ ఆధ్వర్యంలో పుట్టగుంటలో నీట మునిగిన కుటుంబాలకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు, బ్రెడ్‌లు అందించేందుకు మండలం నుంచి గురువారం తరలి వెళ్లారు.

వరద బాధితులకు భోజనాలు

గుడివాడరూరల్: ఎస్టీయూ నందివాడ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం వరద బాధితులకు భోజనాలు ఏర్పాటు చేశారు. జనార్ధనపురం సహకార భవన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని బాధితులకు ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్‌కె ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 300 మందికి భోజనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.దీవెనరాజు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్టీయు జిల్లా పూర్వాధ్యక్షుడు హనుమంతరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మొవ్వ రైతులు

విజయ డెయిరీకి మొవ్వ రైతుల చేయూత

మొవ్వ:వరద ముంపు బారిన పడి కోట్ల రూపాయల మేర నష్టపోయిన విజయ డెయిరీకి మొవ్వ గ్రామానికి చెందిన రైతులు రూ.50 వేలు చేయూతగా అందచేశారు. పాడి రైతులు మండవ కోటేశ్వరరావు, మండవ వెంక్రావుల చేతుల మీదగా చెక్కుని గురువారం పామర్రు విజయ డెయిరీ మేనేజర్ గోపినాథ్, రూట్ సూపర్‌వైజర్ కై లా రమేషలకు అందచేశారు.

మెనూ అమలు చేయాలి



ముదినేపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూ సక్రమంగా అమలు చేయాలని పెయ్యేరు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, స్థానిక ప్రాథమిక పాఠశాల చైర్మన్ మున్నీసా తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని గురువారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయడం, నాణ్యతగా ఉండడంపై ఉపాధ్యాయులను అభినందించారు. ఈ మేరకు భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ రోజూ ఇదే విధంగా భోజనం నాణ్యతగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పెయ్యేరులో అగ్ని ప్రమాదం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరులో గురువారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 3 గేదెలు మృతి చెందగా, పశువుల పాక దగ్ధమైంది. గ్రామానికి చెందిన నిడుమోలు కోటేశ్వరరావు పశువుల పాకపై ఉన్న వీధిలైన్ విద్యుత్‌తీగ తెగి పశువులపాకపై పడి నిప్పురవ్వలు చుట్టుముట్టాయి. వెంటనే కోటేశ్వరరావు పశువులను కాపాడేందుకు పాకలో ప్రవేశించి పశువుల తాళ్లను కత్తితో కోసేశాడు. అప్పటికే పాకకు నిప్పంటుకొని మంటలు ఎగిసిపడడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు కోటేశ్వరరావు బయటకు పరుగులు తీశాడు. పాక చుట్టూ పరదాలు కట్టి ఉండడం దట్టంగా పొగ కమ్ముకోవడంతో పశువులు బయటకు రాలేకపోయాయి. మంటల్లో మూడు పశువులు మృతి చెందగా నాలుగు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. సమాచారం అందుకున్న గుడివాడ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధితుడు కోటేశ్వరరావు తెలిపారు.

మూగ జీవాలకు పశుగ్రాసం



బొబ్బర్లంక(మోపిదేవి): వరద ముంపు గ్రామాలైన బొబ్బర్లంక, కె. కొత్తపాలెం గ్రామాల్లో మూగజీవాలకు పశుగ్రాసం అందించి దాతృత్వం చాటుకున్నారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు అన్నారు. శివరామపురానికి చెందిన సుఖవాసి సురేష్‌బాబు, మేకా రాధాకృష్ణ కంఠంనేని మను, వేములపల్లి శివప్రసాద్, రావి వీరయ్య మిత్రబృందం సహకారంతో రూ. 1.50 లక్షల విలువైన 9 ఎకరాల వరిగడ్డిని మూగ జీవాలకు అందజేసినట్లు వివరించారు. బొబ్బర్లంక, కె. కొత్తపాలెం సర్పంచ్‌లు దొప్పలపూడి గంగాభవాని, కొక్కిలిగడ్డ మాధవి తదితరులు పాల్గొన్నారు.